# ది గెస్ట్



## మల్లాది వెంకట కృష్ణమూర్తి

## THE STORY OF A MAN, A WOMEN AND A CHILD

*( ప్రథమ ప్రచురణ - నవంబర్, 1988)*

### (గత సంచిక తరువాయి)

"సో...?" అడిగాడు విశ్వం తలెత్తకుండా.

"సో రాత్రి అత్తిపత్తి ఉత్తపత్తి అయింది" గర్వంగా చెప్పాడు బెనర్జీ.

"ఇందుకోసం నువ్వు పెట్టిన మొత్తం ఖర్చు.."

తన ముందున్న కాగితంలోని అంకెల్లోని వేలస్థానాన్ని గబగబా కూడి చెప్పాడు.

"..ఆరువేల చిల్లర"

"ఆరువేల చిల్లర కాని ఏడువేల అనుభవాన్ని పొందాను"

తలుపు తెరచుకుని లోపలికి వచ్చిన ఆమె వంక ఇద్దరూ చూసారు.

"హలో" నవ్వాడు బెనర్జీ. "గుడ్ మార్నింగ్"

"రాత్రి ఎందుకలా చేసారు?" తీవ్రంగా చూస్తూ అడిగింది.

"ఎలా?"

ఆమె బెనర్జీ వంక కాసేపు దీక్షగా చూసింది.

"అది మోసం చేయడం" చెప్పింది బాధగా.

"మోసం ఏముంది? వి ఆర్ గోయింగ్ టు బి మేరీడ్ సూన్"

"అంతదాకా ఎందుకు ఆగలేదు? స్పృహలో లేని ఓ అమ్మాయిని ఇలా దగా చేయడం అన్యాయం"

"అది అన్యాయం అనుకుంటే ఆ సంగతి నువ్వు అప్పుడే ఎందుకు చెప్పలేదు? పధ్నాలుగు గంటల తర్వాత ఇప్పుడు చెప్పడం వల్ల ప్రయోజనం?" అడిగాడు బెనర్జీ.

"పెద్దగా ఏం ఉండదనుకోకు" చెప్పాడు విశ్వం పెన్సిల్‌ని బ్లేడ్ తో చెక్కుతూ.

ఆమె విశ్వం వంక ఓసారి తీవ్రంగా చూసి అడిగింది బెనర్జీని.

"రాత్రి నా గోల్డ్ స్పాట్‌లో ఏం కలిపారు?"

"అదలా ఉంచు. గోల్డు కల్తీ అయింది. అంటే గోల్డుకి స్పాట్ వచ్చింది. ఈ సంగతి ఆలిండియా రేడియోలో ప్రచారం చేయడం నీకే మంచిది కాదు"

ఆమె కళ్ళనిండా నీళ్ళు. కొన్ని క్షణాల్లో తేరుకుని చెప్పింది.

"మీ నాన్నగారి గదికి దారెటు?"

"దేనికి?"

బెనర్జీ కనుబొమలు రెండు పైకి లేచాయి.

"మాట్లాడాలి"

ఏం మాట్లాడాలి?"

"మన పెళ్ళి గురించి. అది అయేదాకా నాకు మనశ్శాంతి లేదు"

చిన్నగా నవ్వాడు బెనర్జీ. అది తన భయాన్ని కప్పిపుచ్చుకోడానికి నవ్విన నవ్వు. విశ్వం వంక చుసాడు అతను పెన్సిల్ చివరని గట్టిగా ఊది చెప్పాడు.

"ఇందాకే చెప్పాగా పెద్దగా ఏం ఉండదనుకోవద్దని. మిస్ మైత్రి, కొద్ది నిముషాల సేపు మా ఇద్దర్నీ వంటరిగా వదిలి మీరు బయట కూర్చుంటారా?"

మైత్రి ఇద్దరివంకా చూసి బయటకి నడిచింది.

"ఈ దెయ్యం వెళ్ళి మా నాన్నగారితో జరిగింది చెపితే ఇంకేమయినా ఉందా?" భయంగా చెప్పాడు బెనర్జీ.

"ఆ అమ్మాయి మనమీద ఆధిక్యతతో ఉంది. ఇప్పుడు మనం ఆ అమ్మాయి మీద ఆధిక్యత సంపాదించాలి"

"ఎలా?"

"మీరిద్దరూ గుట్టుచప్పుడు కాకుండా పెళ్ళిచేసేసుకోవడం"

"పెళ్ళే!" అదిరిపడ్డాడు బెనర్జీ.

"తప్పకుండా అదే. ఒకసారి వివాహం అయిందనుకో నువు మొగుడనే సెంటిమెంటుతో ఎవరికీ నీ మీద ఫిర్యాదు చేయదు"

"సమస్య కాంప్లికేట్ అవుతుందేమో?"

"ఆలస్యంగా కాని. ముందే ఎందుకు?"

"మరి అనసూయ..? "

పెన్సిల్ స్టాండులోంచి విశ్వం ఎర్ర రంగు పెన్సిల్ అందుకుని బ్లేడ్‌తో చెక్కుతూ చెప్పాడు.

"నీ భార్య. అందుకు సందేహం ఏముంది?"

"ఇద్దరు భార్యలా? మైత్రి గొడవచేస్తే?"

"ఋజువు? మీ పెళ్ళికి సాక్ష్యం నేనొక్కణ్ణే. నన్ను సాక్ష్యానికి నిలబెడితే అబద్ధం అంటాను. అవసరం వస్తే నన్నే పెళ్ళి చేసుకుందంటాను. నాకు తెలిసి ఏ మధ్యతరగతి అమ్మాయి పెళ్ళికొచ్చి అలా గొడవ చెయ్యదు. చేస్తే డబ్బున్నవాడిపని, వల్లో వేసుకోవాలనుకుందనుకుంటారు తప్ప పెళ్ళయిందనుకోరు"

అనుమానంగా చూసాడు బెనర్జీ.

"పైగా నీ మామ పోలీస్ ఆఫీసర్. ఆ భయం ఉంటుందిగా. ప్రస్తుతానికిలా కానీ. విచారంగా ఫోజు పెట్టుచాలు"

ఆమెని లోపలికి పిలిచారు. విశ్వమే మాట్లాడాడు.

"రాత్రి జరిగింది చెప్పాడు. జరిగిందానికి బాధపడుతున్నాడు. బ్రాంది తప్పు తప్ప, మా వాడిది కాదు. మీ విషయంలో కూడా అంతే. డ్రింక్ తాగితే మీరెలా ప్రవర్తిస్తారో తెలుసుకోవాలన్న చిలిపి ఊహ తప్ప మా వాడికి మరో బుద్దిలేదు."

"కాని ఇంత జరిగాక.."

"దానికే వస్తున్నాను. ఇప్పుడు మీకున్న పరిష్కారాలు రెండు. ఒకటి ఏం జరగలేదనుకోవటం. మొదటిసారికి ప్రెగ్నన్సీ రాదు కాబట్టి ఆ భయం అనవసరం. సమయం చూసి మీ గురించి మా వాడు. వాళ్ళ నాన్నగారికి చెపుతాడు. ఈలోగా మీవాళ్ళు కూడా వచ్చేస్తారు. మీ నాన్నగారిని మీరు సంప్రదించి ఆయన ఒప్పుకుంటే.."

"నో. మా నాన్నగారు వప్పుకోకపోయినా ఇప్పుడు, ఈ పరిస్థితిలో ఆగేదిలేదు. ఐ ఫీల్ ఐ యాం లైకే.. లైకే ప్రాస్టిట్యూట్. ఆ ఊహే భరించలేను."

"ఊరికే, పెద్ద మాటలెందుకండి. కొన్ని వారాలు మాత్రమే ఓపిక పట్టండి."

"ఆగలేను. నా మానసిక స్థితి మీరు అర్ధం చేసుకోలేదు. పెళ్ళికాకుండా.." ఆమె వెంటనే వెక్కి వెక్కి ఏడవసాగింది.

బెనర్జీ చిరాకుగా, విశ్వం ఓపికగా ఆమె వంక చూసారు. కొద్ది నిముషాల్లో ఆమె సర్దుకున్నాక చెప్పాడు విశ్వం.

"మా వాడు మిమ్మల్ని తన భార్యగా భావిస్తున్నాడు. మీరంటే ఎంత ప్రేమో మీకన్నా నాకు బాగా తెలుసు. అలాంటి ఆలోచనలతో ఎందుకు మిమ్మల్ని మీరు కించపరుచుకుంటారు? మీ ఇద్దరికీ పెళ్ళి ఖాయం. సరేనా? మీరు వంటరిగా ఉండకుండా మీ నాన్నగారి దగ్గరకి వెళ్ళండి."

"నో. మా ఇద్దరికీ ఎంత త్వరగా పెళ్ళి జరిగితే అంత మనశ్శాంతి నాకు."

మళ్ళీ ఏడవసాగింది.

"ఏడుపాపు" కసిరాడు బెనర్జీ

"ష్. నువ్వూరుకో. ఆల్‌రైట్. ఇవాళే మీ పెళ్ళి" చెప్పాడు విశ్వం.

నమ్మలేనట్టుగా చూసింది.

"బెనర్జీ డేడి, మమ్మీలతో 'అమ్మ సాయంత్రం సర్కస్‌కి వెళదాం' అంటే సరేనంటారు కాని 'సాయంత్రం నా పెళ్ళి చేయండి' అంటే అలా అనరు. వాళ్ళతో మాట్లాడి పెళ్ళి చేసుకోడానికి కొన్ని నెలలు పడుతుంది. ఈలోగా మీరిద్దరూ ఒకరయ్యారు కాబట్టి 'ఇన్‌స్టంట్ పెళ్ళి' చేసుకోండి. అదీ మీ మనశ్శాంతికే. తర్వాత 'రెగ్యులర్ పెళ్ళి' చేసుకుందురుగాని."

"ఇన్‌స్టంట్ పెళ్ళా?" అడిగింది విస్మయంగా.

"లేదా రాక్షస పెళ్ళి. పురాణాల్లో అలానే అంటారు. అది దగ్గరుండి స్వయంగా నేను జరిపిస్తాను? సాయంత్రం అయిదున్నరకి మీరు మీ ఇంటి దగ్గర సిద్ధంగా ఉండండి."

హైదరాబాద్‌కి అరవై కిలోమీటర్ల దూరంలోని కొత్తగా కట్టిన ఓ గుళ్ళో వారిద్దరూ దండలు మార్చుకున్నారు. సాక్ష్యం విశ్వం, పూజారి మాత్రమే.

"ఈ దేముడు సాక్షిగా, పంచభూతాల సాక్షిగా, విశ్వం సాక్షిగా ఈ క్షణం నుంచి నువ్వే నా ధర్మపత్నివి. సహధర్మచారిణివి" ఆమె చేతులు పట్టుకుని ప్రమాణం చేసాడు బెనర్జీ దండలు మార్చుకున్నాక.

"ఈ దేముడు సాక్షిగా.." ఆమె ప్రమాణం చేసింది.

చప్పట్లు కొట్టాడు విశ్వం. స్వీట్సు పాకెట్ విప్పి, ముగ్గురికీ స్వీట్సు పంచాడు.

వాళ్ళిద్దరూ కారువైపు నడిచాక అడిగాడు విశ్వం పూజారిని.

"ఆ వెళుతున్న అమ్మాయి ఎవరు? ఎప్పుడయినా నీ గుళ్ళో చూసావా? ఎవరినయినా పెళ్ళి చేసుకుందా?"

ఆ అరవై ఏళ్ళ పూజారి తన కేటరాక్ట్ కంటితో చూసి చెప్పాడు.

"ఎప్పుడూ చూడలేదండి. అసలు నా గుళ్ళో పెళ్ళయితే ఆ సంగతి ఓ పుస్తకంలో నమోదు చేస్తాం అలాంటిదేం లేదండి."

"వెరీగుడ్ ఆ మాట మీదే ఉండు. రేపు సాయంత్రం మీరు హైదరాబాద్ నర్సింగ్ హోమ్‌కి రండి. ఆపరేషన్ అయాక అక్కడ కొంతకాలం ఉండాల్సిన అవసరం ఉంటే అంతదాకా ఉండచ్చు. అన్ని విషయాలు మేం చూసుకుంటాం"

ఆయన చేతులెత్తి నమస్కారం చేసి చెప్పాడు "మీకు ఆ భగవదానుగ్రహం ఉండాలి."

"ఇది కూడా ఉంచండి."

ఓ అయిదు రూపాయల కట్టని ఆయనకి అందించాడు విశ్వం.

కారు దగ్గరకి వెళ్ళి పక్కకి పిలిచాడు బెనర్జీని.

"నీ పెళ్ళయ్యేదాకా మైత్రి మంచి కాలక్షేపం. కొత్తపెళ్ళికూతురుతో ఆ మాత్రం కాలక్షేపం లేకుండా ఉంటే అనుమానం వస్తుంది. నువ్వా కార్యక్రమంలో ఉండు" నవ్వాడు విశ్వం.

విశ్వం మోటర్ సైకిల్ ఎక్కి స్టార్ట్ చేసి పోనిచ్చాడు. కారువైపు నడిచాడు బెనర్జీ. ఈ మోసాలేం తెలీని కొత్త పెళ్ళికూతురు గుండెల నిండా కోటి అనుభూతులతో కారులో కూర్చుని తన భర్తవంక చూస్తోంది.

బెనర్జీ వచ్చి ఆమె పక్కనే కూర్చుని నడుం చుట్టూ చేతిని వేసాడు. ఆమె సిగ్గుగా చేతులని పక్కకి తోసింది తప్ప గత రాత్రిలా అయిష్టంగా కాదు.

"మైత్రి ఈ రాత్రి నిజమయిన రాత్రి మనిద్దరికి. పార్టనర్ సహకరిస్తేనే సెక్స్‌లో సుఖం. లేకపోతే శవంతో సంపర్కంలా ఉంటుంది."

"మీ కెలా తెలుసు?" అడిగింది ఆమె చిన్నగా నవ్వుతూ.

"గత రాత్రి ఓ బ్రతికున్న శవంతో గడిపాక తెలుసుకున్నాను. నవ్వి కారు స్టార్ట్ చేశాడు బెనర్జీ.

6

బెనర్జీ తొలిసారిగా తను మైత్రిని చూసిన రోజు నుంచి, ఆమెని పరిచయం చేసుకుని సెక్సువల్‌గా లొంగదీసుకుని, తప్పనిసరి పరిస్థితుల్లో తనామెని గుళ్ళో దొంగపెళ్ళి చేసుకున్న సందర్భం దాకా గుర్తుతెచ్చుకున్నాడు. ఆ రోజుల్లో తనకున్న ఓర్పుకి అతనికే ఆశ్చర్యం కలిగింది. ఒక అమ్మాయితో పొందు కోసం తను ఎంతకాలం, ఎంత డబ్బు ఖర్చు చేసాడు!

అప్పట్లో తను యువకుడు కాబట్టి ఆ ఓపిక ఉండేది. పైగా బాధ్యతారహితంగా ఉండేవాడు. తండ్రే అన్ని వ్యవహారాలు చూసుకుంటూండటంతో ఇప్పుడు తను అలా చేయలేడు. అతను కారుని ఫేక్టరీ కాంపౌండ్ లోని తనకి ప్రత్యేకింప బడ్డ కారు షెడ్‌లోకి పోనించి పార్క్ చేసాడు. ఆఫీసు గదిలోకి నడిచి ఇన్‌ట్రేలోని కాగితాలని అందుకున్నాడు కాని అతని మనసు ఆఫీసు పని మీద లేదు. వద్దనుకున్నా ఆ రోజుల్లోని మైత్రే, ఆమె భర్తగా తను దాదాపు మూడువారాలపైన పొందిన అనుభవం గుర్తుకు వస్తోంది.

అతను ఎంతో మంది స్త్రీలని అనుభవించినా సెక్సువల్‌గా అత్యధిక అనుభవం ఇచ్చిన స్త్రీలని కుడిచేతి వేళ్ళమీద లెక్కపెట్టగలడు. వాళ్ళలో మైత్రి ఉంది. ఆ తర్వాత మళ్ళీ బెనర్జీకి అలాంటి అనుభవం ఇచ్చేవాళ్ళే ఎదురవలేదు.

బెనర్జీకి మైత్రిని చూడాలనిపించింది. కాని తమాయించుకున్నాడు. తన స్వభావం ఆమెకి కొట్టిన పిండే తను రెండోసారి అంత తేలిగ్గా లొంగదీసుకోలేడు. కానీ మళ్ళీ మైత్రిని పక్కలోకి తెప్పించుకోగలిగితే తను నిజంగా గ్రేట్.

మళ్ళీ మరో ఎక్సయిటింగ్ గేమ్ మొదలుపెడితే తనకి మజాగా ఉంటుంది. అయితే అది ప్రమాదంతో కూడిన ఆట అవుతుంది. తుపాకి గుండు దెబ్బతిని, బలమయిన గాయంతో తప్పించుకున్న పులి కోసం మళ్ళీ వేటాడే వేటగాడు అప్రమత్తంగా ఉండాలి. లేకపోతే ఆ పులి ఎదురు తిరిగి అతన్నే మట్టుపెట్టచ్చు.

విశ్వం గదిలోకి వచ్చాడు.

"గుడ్ మార్నింగ్" విష్ చేసాడు.

"గుడ్ మార్నింగ్" అన్యమనస్కంగా చెప్పాడు బెనర్జీ.

బెనర్జీ లేచి ఫ్రిజ్ తెరచి సోడా సీసా తీసుకున్నాడు. రెండు గ్లాసుల్లో విస్కీపోసి సోడా వంచాడు. ఓ గుక్క తాగాక గ్లాసుని టేబుల్ మీద ఉంచి చెప్పాడు బెనర్జీ.

"ఈ లోకంలో నా కన్ని దురలవాట్లకన్నా నచ్చేది విస్కీనే."

"ఏం?" నవ్వుతూ అడిగాడు విశ్వం. "మిగతావేం పాపం చేశాయి?"

"గంజాయి, భంగులాంటివి తాగితే మన మనసు, శరీరం మన కంట్రోల్‌లో ఉండదు. వద్దనుకున్నా నవ్వడమో, ఏడవడమోలాంటివి చేస్తూంటాం. ఈ బుజ్జిముండ ఎక్కువగా కడుపులోకి వెళ్ళిందనుకో. ఎట్ ది మోస్ట్ గుడ్ నైట్ చెపుతుంది. దాంతో వద్దనుకున్నా నిద్రలోకి జారిపోతాం. మర్నాడు ఉదయం హాయిగా లేస్తాం" చెప్పాడు బెనర్జీ.

"ఓ ఐడియా వచ్చింది" చెప్పాడు విస్కీ తాగి.

"ఏమిటి?"

బెనర్జీ కొన్ని క్షణాలు ఆలోచించి చెప్పాడు తృప్తిగా.

"మంచి ఐడియానే. రేపు ఉదయం పేపర్లో ఓ ప్రకటన వేయాలి. అమృత ఫుడ్ ప్రాడక్ట్స్ వాళ్ళ టెక్నికల్ మేనేజర్‌కి జీతం ఎంత?"

"రెండు వేల తొమ్మిది వందలు."

"గుడ్ అతనికున్న క్వాలిఫికేషన్, అనుభవం ఉదహరిస్తూ ఆ క్వాలిఫికేషన్, ఆ అనుభవం గల టెక్నికల్ మేనేజర్ కావాలని ప్రకటన వెయ్యి. అది అతను చూసే ఏర్పాటు చెయ్యి. జీతం అయిదువేలు"

"అందువల్ల మనకేమిటి లాభం?" అడిగాడు విశ్వం ఆశ్చర్యంగా.

"ఎందుకో నీకే స్వయంగా తెలుస్తుందిగా. ఇండస్ట్రియల్ స్పయింగ్‌లో ఓ కొత్త పద్ధతి కనిపెట్టాను" చెప్పాడు బెనర్జీ.

టెలిఫోన్ బెల్ మోగింది. రిసీవర్ అందుకున్నాడు బెనర్జీ.

"హలో? బెనర్జీ?" వినిపించింది అవతలి నుంచి.

"అవును? మీరు?" అడిగాడు బెనర్జీ.

"డాక్టర్ దేవ్ సేన్"

"ఓ నువ్వా"

బెనర్జీ వెంటనే గ్రహించగలిగాడు డాక్టర్ ఎందుకు ఫోన్ చేశాడో. తన సెమిన్‌ని పరీక్షకి ఇచ్చాడు. రిపోర్ట్ వచ్చేరోజు ఆ రోజే.

"నేను ఓ అరగంటలో వస్తాను. ఉంటున్నావా?" అడిగాడు డాక్టర్.

"ఉంటాను"

"రిపోర్ట్ వచ్చింది. బయలుదేరుతున్నాను" అవతలివైపు ఫోన్ పెట్టగానే ఫోన్ పెట్టేశాడు బెనర్జీ.

ఇంకో అయిదు నిమిషాల్లో అరగంటవుతుందనగా చెప్పాడు విశ్వంతో.

"మళ్ళీ పిలుస్తాను"

విశ్వం వెళ్ళాక ఆలోచిస్తూండిపోయాడు బెనర్జీ. దేవ్‌సేన్ తెచ్చే రిపోర్టులో ఏం ఉంటుంది? మంచివార్తా? చెడ్డవార్తా? మంచివార్తయితే ఫోన్ లోనే చెప్పవచ్చుగా? ఒకవేళ బేడ్ న్యూసేమో? అందుకనే ఫోన్‌లో చెప్పడం ఇష్టంలేక స్వయంగా వస్తున్నాడా? గుడ్ న్యూసే అయివుంటుంది. బేడ్ న్యూస్ అయితే మొఖం మీదకంటే ఫోన్‌లోనే చెప్పచ్చు.

డాక్టర్ వచ్చేదాకా రకరకాల ఆలోచనలు అతని వేధించసాగాయి.

దేవ్ సేన్ గదిలోకి వచ్చాక బెనర్జీతో కరచాలనం చేసి కుర్చీలో కూర్చున్నాడు.

"వ్యాపారం ఎలా వుంది?" అడిగాడు డాక్టర్.

కుడికాలితో టేబుల్ కింద ఉన్న కాలింగ్ బెల్ నొక్కాడు బెనర్జీ రెండుసార్లు. కొన్ని క్షణాల్లో అతని కంపెనీ తయారు చేసే కూల్ డ్రింక్ గ్లాస్‌తో లోపలికి వచ్చాడు ప్యూన్. డాక్టర్ కూల్ డ్రింక్ తాగాక అడిగాడు బెనర్జీ.

"ఈజిట్ ఏ గుడ్ న్యూస్ ఆర్ బేడ్?"

"ఐయామ్ ఎఫ్రైడ్ ఇటీజ్ బేడ్ న్యూస్. నీకు పిల్లలుపుట్టే అవకాశం లేదని తేలింది."

బెనర్జీ మొహం క్షణాల్లో పాలిపోయింది వణుకుతున్న చేతులతో టేబుల్ మీది సిగరెట్ పాకెట్‌ని లైటర్‌ని అందుకుని ఓ సిగరెట్ వెలిగించి, ఊపిరితిత్తులనిండా పొగని పీల్చి వదిలాడు.

"సో, లోపం ఉన్నది నాలోనే అన్నమాట."

"ఇది నేను నమ్మలేకపోతున్నాను. మెడికల్ హిస్టరీలో ఇలాంటి విచిత్రం అసాధ్యం" చెప్పాడు దేవ్‌సేన్.

"ఇది మొదటి నుంచీ ఉండివుంటుందా లేక మధ్యలో వచ్చిందా?!"

"నువ్వు పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేయించుకోలేదుగా?" అడిగాడు దేవ్ సేన్.

తల అడ్డంగా ఊపాడు బెనర్జీ.

"అయితే పుట్టుక నుంచి ఉండచ్చు"

"మరి.. మరి ఇంతకాలం నా వల్ల గర్భవతులయిన వాళ్ళంతా అబద్దం చెప్పారా?"

దేవ్‌సేన్ లేచి నిలబడ్డాడు.

"గుడ్ బై" చెప్పాడు బెనర్జీ.

"ఐయామ్ సారీ.. గుడ్ బై"

తలుపు దాకా వెళ్ళి ఆగి, కొన్ని క్షణాలు ఆలోచించి మళ్ళీ బెనర్జీ దగ్గరకి నడచి వచ్చాడు. టేబుల్ మీద రెండు చేతులు ఉంచి ముందుకు వంగి బెనర్జీ కళ్ళల్లోకి కొన్ని క్షణాలు చూసి చెప్పాడు.

"నీకో సంగతి చెప్పాలి. పూర్వం ఓ మనిషి మతి మరుపుతో బాధపడుతుండేవాడు. ఇందాక జరిగింది ఇప్పుడు గుర్తుండేది కాదు. ఓ డాక్టర్ దగ్గరకు వెళ్ళాడు. నిముషం క్రితం జరిగింది గుర్తుండటం లేదు అని చెప్పాడు.." ఆగి మళ్ళీ చెప్పసాగాడు. "డాక్టర్ అతన్ని రకరకాల పరీక్షలు చేసి 'ఎంతసేపటి క్రితం సంగతి మర్చిపోతున్నావు?' అని అడిగాడు"... మళ్ళీ కొద్దిక్షణాలాగి నవ్వుతూ చెప్పాడు దేవ్ సేన్. "వెంటనే ఆ పేషెంట్ 'ఎంతసేపటి క్రితం సంగతి మర్చిపోవడం ఏమిటి?' అని ఆశ్చర్యంగా అడిగాడు"

బెనర్జీ కూడాచిన్నగా నవ్వాడు.

"ఈ కథలోని నీతి ఏమిటంటే నిమిషం క్రితం జరిగింది మర్చిపోగలిగితే మనిషి ఆనందంగా బ్రతకగలడు. గుర్తుంటేనే బాధ అసలీ విషయమే మర్చిపోవడానికి ప్రయత్నించు"

"సాధ్యం కాదు. ఈ జీవితకాలం ప్రాక్టీస్ చేసినా అది సాధ్యం కాదు" చెప్పాడు బెనర్జీ.

"కష్టం.. ముఖ్యంగా *మానసిక కష్టం అనేది గోళీకాయలాంటిది. కంటికి దగ్గరగా పెట్టుకుని చూస్తే ఎంతో పెద్దదిగా కనిపిస్తుంది. ఈ లోకాన్నే మూసేస్తుంది. దూరంగా జరిపితే? ఎంతో చిన్నదిగా లోకం ఎంతో విశాలంగా కనిపిస్తుంది.* నీ కష్టాన్ని కంటికి దగ్గరగా ఉండే గోళీకాయలా ట్రీట్ చేయక, దూరంగా ఉంచు"

"థాంక్స్ ఫర్ యువర్ ఎడ్వైజ్" చెప్పాడు బెనర్జీ లేచి మరోసారి డాక్టర్‌తో కరచాలనం చేస్తూ.

దేవ్‌సేన్ వెళ్ళిపోయాక గ్లాసులో ఓ పెగ్ వంచుకుని సోడా కలుపుకుని విస్కీని గటగట తాగేశాడు. ఆ తర్వాత మరో పెగ్ అలాగే తాగాడు ఇంకోటి. క్రమంగా కడుపులోని విస్కీ రక్తంలో కలిసి తలకి ఎక్కసాగింది.

తనకి పిల్లలు పుట్టకపోతే ఏమిటట? ఈ లోకం ఆగిపోదు. తను చచ్చిపోడు. ఎందుకింత పిచ్చి బాధ? తనలో శక్తి ఉన్నంత వరకు రకరకాల స్త్రీలతో సెక్సు సుఖం అనుభవిస్తూనే ఉంటాడు. తనకు ఎవరూ ఉరిశిక్ష వేయలేదు. యుద్ధానికి పంపటం లేదు. తన వ్యాపారం మునిగిపోయి ఐ.పి. పెట్టే పరిస్థితిలోలేడు. తన భార్య లేచిపోలేదు. తల్లి చచ్చిపోలేదు. తనకి కేన్సర్ రాలేదు. అలాంటి కష్టాలేంలేవు తనకి. జస్ట్ ఓ చిన్న లోపం అంతే. అంతకు మించి మరేం కాలేదు.

డాక్టర్ దేవ్ సేన్ టేబుల్ మీద పెట్టిన కవరుని మునివేళ్ళతో అందుకున్నాడు. లైటర్ వెలిగించి దాని ఓ చివర అంటించాడు. క్రమక్రమంగా కవరు అంటుకుని మొత్తం కాలిపోయింది. మసిని డస్ట్‌బిన్‌లో వేసాడు.

"కాల్చేసాను. నిజాన్ని కాల్చేసాను" మగతగా గొణుక్కున్నాడు.

అతనికా నిముషంలో బాధాలేదు, సంతోషం లేదు, ఎలాంటి భావంలేని ఉదాశీనత.

'పిల్లలు పుట్టిన వాళ్ళకి బేంకులో కోటి రూపాయలు ఫిక్సెడ్ డిపాజిట్ లో వేసుకున్న ధీమాలాంటి సంతోషం. నాకిక అది ఈ జీవితంలో ఉండదు' అన్నది బెనర్జీకి కలిగిన ఆఖరి ఆలోచన. టేబుల్ మీద తలవాల్చి నిద్రలోకి జారిపోయాడు.

లోపలికి వచ్చిన విశ్వం బెనర్జీని చూసి ఆశ్చర్యంగా గదిలోకి రాకుండానే వెనక్కి వెళ్ళిపోయాడు. మధ్యాహ్నం మూడుం పావుకి బెనర్జీకి మెలుకువ వచ్చింది. మత్తు కొద్దిగా తగ్గింది.

లేచి బయటకి నడిచాడు. అరగంటలో ఇంటికి చేరుకున్నాడు.

"అదేమిటి ఎన్నడూ లేంది అప్పుడే వచ్చేశారు?" అడిగింది అనసూయ ఆశ్చర్యంగా.

"ఆకలి వేస్తోంది వడ్డించు" మరో రెండు పెగ్గులు తాగి భోజనం చేసి మళ్ళీ పడుకున్నాడు బెనర్జీ. మర్నాడు ఉదయం దాకా మెలుకువ రాలేదతనికి.

●●●

విశ్వం సింహాచలానికి పురమాయించాడు ఆ ఫేక్టరీలోని ఆడవాళ్ళ బాత్ రూములలో బెనర్జీ గురించి అసహ్యంగా రాసింది ఎవరో కనుక్కోమని. ఆయన దాని గురించి ఓ ఫైల్ ఓపెన్ చేసాడు. అనేక మందిని అడిగాడు. అందరు ఆడవాళ్ళ చేతివ్రాతల నమూనాలు సేకరించి ఆ గోడమీద రాతతో పోల్చిచూసాడు. ఆ రాత ఇద్దరి చేతివ్రాతలకి దగ్గరగా ఉంది. వాళ్ళిద్దరూ ఆ పని నాది కాదంటే నాది కాదని చెప్పారు.

అది ఆ ఇద్దరిలో ఒకరి పని అని తెలిస్తే సరి అనుకున్నాడు. ఆయన కూడా అది ఆ ఇద్దరిలో ఒకరిపని అని నమ్మకంగా చెప్పలేడు. బెనర్జీ ఆ విషయం అంతటితో మర్చిపోతే సరి. గుర్తుంచుకుని అడిగితే తను కనుక్కున్నానని చెప్పటానికి తగ్గ ఫైల్‌ని సిద్ధంగా ఉంచాడు. కానీ బెనర్జీ ఆ సంగతి మర్చిపోయాడు. ✷✷✷

*(ఇంకా ఉంది)*

Post your comments